# తోతాపురికి గిట్టుబాటు ధర కల్పిస్తాం: కలెక్టర్

### జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు కృషి: ఎంపీ వరప్రసాద్

**ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):** జిల్లాలో మామిడి బోర్డ్ ఏర్పాటుకు కృషిచేస్తున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో చిత్తూరు జిల్లాలో అత్యధికంగా పండించే తోతాపురి మామిడికి గిట్టుబాటు ధరకు సంబంధించి మామిడి రైతులతో, ప్రాసెసింగ్ కంపెనీల యజమానులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఉద్యాన పరిశ్రమల శాఖ సంచాలకులు డాక్టర్ కే.శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు, నగరి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కె.మురళీ మోహన్, గాలి భాను ప్రకాష్, చిత్తూరు, తిరుపతి అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు జి.విద్యాధరి, శుభం బన్సల్, ఆదర్శ రాజేంద్రన్, చుడా చైర్పర్సన్ కటారి హేమలతలతో కలిసి చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ప్రాసెసింగ్ కంపెనీల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం చిత్తూరు పార్లమెంటు సభ్యులు వరప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మామిడి పంట సాగు అధికంగా ఉన్నదని ఇందులో ప్రధానంగా ప్రాసెసింగ్‌కు అవసరమైన తోతాపురి రకం ఎక్కువగా పండించడం జరుగుతుందన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మామిడి బోర్డ్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సంబంధిత శాఖలకు అందించడంతోపాటు కేంద్ర మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు. రైతులు ప్రాసెసింగ్ కంపెనీల యజమానులు ఇద్దరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు.
యూరోపియన్ దేశాలలో మామిడి ఎగుమతికి సమస్య ఉందని ప్రాసెసింగ్ కంపెనీల యజమానులు తెలుపగా.. ఇప్పుడున్న పరిస్థితుల్లో సమస్య కలదన్నారు. యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేసే మామిడి గుజ్జు, జ్యూసులపై దిగుమతి సుంకం తగ్గింపునకు మినిస్టర్ ఆఫ్ కామర్స్ వారికి కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మామిడి రైతుల కష్టాలు తెలిసిన వారని రైతుల కష్టం తీర్చే బాధ్యత ముఖ్యమంత్రి తీసుకుంటారన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి బోర్డ్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎంపికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ మామిడి గుజ్జు, జ్యూస్‌లపై జిఎస్టి ఎత్తివేతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి ముఖ్యమంత్రి ఈ విషయాన్ని తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. దీనితో పాటు యూరోపియన్ దేశాలలో వేస్తున్న దిగుమతి సుంకాన్ని తగ్గించే అంశాన్ని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి సీజన్‌లో తోతాపురి రకానికి సంబంధించిన గిట్టుబాటు ధర విషయంలో రైతులు, ప్రాసెసింగ్ కంపెనీల సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. తోతాపురి మామిడి రకంకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, రైతులతో పాటు ప్రాసెసింగ్ పరిశ్రమల వారు కూడా పరిశ్రమలు నిర్వహించేందుకు అనుగుణంగా ఇద్దరికీ సామరస్యంగా ఉండేందుకు కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో ముందుకు వెళ్తామన్నారు.

ఈ సందర్భంగా రైతులు వారి అభిప్రాయాలను తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి రకానికి గిట్టుబాటు ధర కల్పించాలని, మామిడి పంటను ప్రోత్సహించిన ప్రభుత్వం ఈ పంట మార్కెటింగ్ అంశంపై కూడా దృష్టి పెట్టాలని కోరారు. ఉపాధి హామీని మామిడి రైతులకు అనుసంధానం చేయాలని కోరారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు దాని అమలుకు సంబంధించి జిల్లా యంత్రాంగం పర్యవేక్షించాలన్నారు. ఈ పంట సాగుకు పెట్టుబడి ఎక్కువ అని రాబడి తక్కువ అని వర్షానికి పంట రాలిపోయిన రైతుల బాధ వర్ణనాతీతమన్నారు. మామిడి జ్యూస్‌ను స్థానిక ఆలయాలలో అందించేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి బోర్డ్ ఏర్పాటుకు అవసరమైన రోడ్డు కనెక్టివిటీ కలదని రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రాసెసింగ్ కంపెనీలలో ఇప్పటికే ఎక్కువగా గుజ్జుకు నిల్వలో ఉందని, మామిడి గుజ్జుకు డిమాండ్ తగ్గిందని ఇందుకు అనేక కారణాలు కలవని డొమెస్టిక్ మార్కెట్‌లో వినియోగదారులు ఆలోచనపై ఈ అంశం ఆధారపడి ఉందని వినియోగదారులు ఎక్కువగా ఎనర్జీ డ్రింక్స్ పట్ల ఆకర్షితులు కావడం మామిడిలో షుగర్ లెవెల్స్ ఉన్నాయని ఉద్దేశంతో వీటి వాడకం తగ్గుతున్నదని ఈ అంశం ప్రాసెసింగ్ కంపెనీల వారిని ఆందోళనకు గురి చేస్తుందని చర్చ కార్యక్రమంలో తెలిపారు. దశల వారీగా కోతలు కోయడం ద్వారా ప్రాసెసింగ్ కంపెనీల వారు కూడా రైతులకు సరైన ధర అందించేందుకు అవకాశం కలగని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె.మోహన్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు తిరుపతి, అన్నమయ్య జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు మధుసూదన్ రెడ్డి, దశరథ రామి రెడ్డి, రవి చంద్రబాబు, మామిడి రైతులు, ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ఉద్యానశాఖ అధికారులు, రైతులు

# ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి

### ప్రజలకు రక్షణ కల్పించాలి : సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

కుశస్థలి నది నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** నగరి నియోజకవర్గంలో తరని మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబర కుప్పం కుశస్థలి నదిలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ చేస్తూ, మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకువచ్చిన చర్యలు తూతూ మంత్రంగానే ఉండటం వలన అక్రమ వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతూ రాత్రింబవళ్లు తేడా లేకుండా హద్దులు మీరు ఇసుకను తవ్వేస్తున్నారు, తరని దళితవాడకు సంబంధించిన శ్మశానాల సైతం తోడేస్తున్నారని తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలించడమే కాకుండా స్థానిక ప్రజలు అడిగితే వారి మీద దాడులు చేస్తూ ఎవరికి చెప్పుకుంటారు చెప్పుకోండి మా ఇష్టం వచ్చినట్లు చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం 4 గంటల నుంచి విచ్చలవిడిగా ఇసుక తోడుతూనే ఉన్నారని, ప్రతీ రోజూ ఇదే సమస్యగా ఉందని స్థానిక ప్రజలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తూ వీరు వెళ్ళే స్పీడుకి రోడ్డు పైకి రావాలంటే భయమేస్తుందని పిల్లలు, మహిళలు భయపడుతున్నారని తెలిపారు. ఇసుక ఎక్కువ తీయడం వలన చుట్టు పక్కన గ్రామాలకు తాగేనీటిలో రంగు నీళ్ళు కలిసిపోయిందని, ఇక్కడ చాలా మంది వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ఇక్కడ ఉన్న స్థానిక ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ పైనే ఉందని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# యోగ విశ్వవ్యాప్తం కావాలి: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం ఉదయం నిర్వహించిన ముందస్తు యోగా కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, యోగ సభ్యులతో కలిసి యోగాసనాలు వేశారు. 'యోగ' ప్రపంచంలో భారత్ దేశానికి ప్రత్యేక స్థానాన్ని తీసుకొచ్చిందని, యోగాను విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు, యువత భాగస్వాములై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# గ్రామస్థాయి నుంచి 'యోగాంధ్ర' నిర్వహణ: కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** యోగాపై అవగాహన కల్పిస్తూ ఈనెల 26 నుండి జూన్ 21వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా ఈనెల 21 నుండి జూన్ 21 వరకు యోగ మాసంగా ప్రభుత్వం ప్రకటించినందున గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకునిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాల నిర్వహణపై కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యోగాపై అవగాహన పెంచేందుకు ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలలో యోగ ఉత్సవాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి యోగా గురువులు, మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలన్నారు. యోగ కార్యక్రమంలో పాల్గొనేందుకు సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేయాలన్నారు. యోగపై అవగాహన కల్పించడం మన బాధ్యతగా తీసుకొని మంచి కార్యక్రమాన్ని పకడ్బందీగా క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా నిమగ్నమై పనిచేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా పర్యాటక అధికారి గౌరీ, డిఆర్‌డిఎ పీడీ శ్రీదేవి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిఎల్‌డిఓ రవికుమార్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బాలాజీ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, చిత్తూరు కార్పొరేషన్ ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్

**ప్రజాశక్తి- కుప్పం టౌన్:** కుప్పం పీఈఎస్ వైద్యకళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్-2025ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డీన్, ప్రిన్సిపల్, డాక్టర్ హెచ్ఆర్.కృష్ణ రావు, ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి పరిశీలకుడు డాక్టర్ ఎన్.రాజా రమేష్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ చిత్రా నాగరాజ్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా కృష్ణ రావు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో మెరుగైన ఫలితాలను సాధించడానికి పరిశోధన ఒక కీలక సాధనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు పరిశోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి శిక్షణలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం 22 నుండి 25వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఇది శాస్త్రీయ సహకారం, విద్యా అభివృద్ధి, వైద్య పరిశోధనలో సామర్థ్య పెంపునకు మద్దతు ఇచ్చే వేదికగా నిలుస్తుందన్నారు.

# వసతి గృహ నిర్మాణాలకు భూమిపూజ

**ప్రజాశక్తి- కుప్పం రూరల్:** కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళ వసతి గృహ నిర్మాణానికి గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిదంబరం ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రావిడ కూడలిలోని మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గ పరిధిలోని పేదవిద్యార్థుల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో కూడిన భవనాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిర్మించిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. అలాగే ప్రస్తుతం విద్యార్థునుల సౌకర్యార్థం వసతి గృహనిర్మాణానికి సైతం తెలుగుదేశం పార్టీ పూనుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గం పరిధిలోని పేద విద్యార్థునుల సౌకర్యార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ. 5కోట్లు నిధులతో వసతి గృహాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. ఇందులో రూ. 3.25 కోట్లతో వసతి గృహ భవనాన్ని, ప్రహరీగోడ నిర్మించనుండగా, మిగిలిన రూ. 1.75 కోట్లతో వసతి గృహానికి అవసరమైన బోర్ వెల్, కంప్యూటర్లు, ఫర్నిచర్, డిజిటల్ తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ పరికరాలు, క్రీడా సామగ్రి తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, ఎడ్యుకేషన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజ్, కుప్పం, గుడుపల్లి నాయకులు రాజ్‌కుమార్, బాబు, రాజు, వెంకటేష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

వసతి గృహనిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ

# కవరు కట్టు.. లాభాలు పట్టు..

### మామిడి దిగుబడిపై రైతుల ప్రత్యేక దృష్టి

**ప్రకృతి వైపరీత్యం ధరల తగ్గుదల కీటకాల సమస్యలు ఇలా అనేక కారణాలతో ప్రతి ఏడాది మామిడి రైతు ఏదో ఒక విధంగా నష్టపోతునే ఉన్నాడు. ఇలాంటి సమయంలో మామిడి రైతులను ఆదుకోవడంలో భాగంగా ప్రభుత్వం నూతన ఆలోచన వరవడికి శ్రీకారం చుట్టింది. నాణ్యమైన పంట దిగుబడి కి రైతులకు అవసరమైన కవర్లను సబ్సిడీ రూపంలో అందిస్తోంది.**

**ప్రజాశక్తి- పూతలపట్టు**

పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లి, బంగారుపాళ్యం, ఐరాల, యాదమరి, పూతలపట్టు ఐదు మండలాల పరిధిలో అత్యధికంగా మామిడి పంట సాగులో ఉంది. భూగర్భ జలాలు తక్కువ కావడం.. వ్యవసాయంలో నష్టాలు చవిచూస్తున్నడంతో రైతులు అత్యధికంగా మామిడి పంట వైపు చూస్తున్నారు. ఏడాదిలో ఒకసారి వచ్చే పంట.. పైగా ఈ పంటకు పెద్దగా ఖర్చులు ఉండవని రైతుల ఆలోచన.. కానీ ప్రస్తుతం మామిడి చెట్లకు కూడా రసాయనాలు వాడటం వలన ఖర్చులు కూడా ఇదే స్థాయిలో ఉంది. ప్రస్తుతం ఆదాయం పక్కన పెడితే పెట్టిన ఖర్చులు కూడా రావడంలేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి రావడం ఒక ఎత్తు అయితే.. ఈ పంట అమ్ముకోవడం మరింత భారంగా మారిందని రైతులు అంటున్నారు. రోజులు తరబడి కర్మాగారాల వద్ద వేచి ఉండాల్సి వస్తుందని అంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కర్మాగార యాజమాన్యులంతా సిండికేట్‌గా మారి ధరలను పూర్తిగా తగ్గించేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కొద్దోగొప్పో ధరలు ఉన్నాయంటే మామిడిలోని రకాలకు మాత్రమే. కొన్ని రకాలు మామిడి అధిక ధరలకు అమ్ముడుపోతుండడంతో ప్రభుత్వం కూడా ఇందుకు తగ్గట్టుగా నూతన ఆలోచనలతో రైతులకు సబ్సిడీ రూపంలో మామిడికాయలకు కట్టే కవర్లను సరఫరా చేస్తుంది.

**కవర్ల వలన లాభం...**

రకాల మామిడికి కవర్లు కట్టడం వలన పంది ఈగ బారి నుంచి పంటను కాపాడుకోవచ్చు. అదేవిధంగా యూనిఫామ్‌గా పంట సైజు ఉంటుంది. పంట కలర్ కూడా ఒకే విధంగా ఉండటం వలన పంట అధికధరలకు అమ్ముడు పోతుంది. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా మామిడి తోటల్లో కాయలకు కవర్లు కట్టి పెట్టి ఉన్న దృశ్యం తారాసపడుతుంది.

తవణంపల్లి మండలంలో మామిడి పంటకు కవర్లు కట్టిపెట్టిన దృశ్యం

**నియోజకవర్గంలో...**

పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల మండలంలో మొత్తం 8900 ఎకరాల మామిడి పంట సాగులో ఉండగా 7,82,500 కవర్లు రైతులకు పంపిణీ చేశారు. తవణంపల్లి మండలంలో 12318 ఎకరాల మామిడి పంట సాగులో ఉండగా 15,22,840 కవర్లు పంపిణీ చేశారు. బంగారుపాళ్యం మండలంలో 13760 ఎకరాల మామిడి పంట సాగులో ఉండగా 24,76,000 మామిడి కవర్లను రైతులకు పంపిణీ చేశారు. అదేవిధంగా యాదమరి మండలంలో 4800 ఎకరాల మామిడి పంట సాగులో ఉండగా 3,24,000 కవర్లు పంపిణీ చేశారు. పూతలపట్టు మండలంలో ఐదువేల ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉండగా నాలుగు లక్షల కవర్లు 50శాతం సబ్సిడీతో రైతులకు అందించినట్లు ఆర్టికల్చర్ అధికారులు తెలిపారు.

# అకాల వర్షం.. తెచ్చిన నష్టం..

### ఆదుకోవాలంటున్న మామిడి రైతులు

**మామిడి, ఉద్యాన రైతులకు ప్రాధాన్యత కల్పించి అకాల వర్షాల వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించి మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని జిల్లాలోని మామిడి రైతులు కోరుతున్నారు.. తోతాపూరి రకానికి గిట్టుబాటు విషయంలో మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు, మామిడి రైతులతో చర్చలు జరుపుతున్న ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు మామిడి రైతు గిట్టుబాటు విషయంలో మామిడి రైతులను ఆదుకునేలా ఉండాలని పలువురు మామిడి రైతులు కోరుతున్నారు.**

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:**

చిత్తూరు జిల్లాలో ప్రధానంగా రైతాంగం ఉద్యానవన పంటలవైపు మొగ్గు చూపుతోంది. అందులో మామిడి సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం వలన రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి 30శాతం పైగా దిగుబడులను సాధిస్తుంది. అయితే ప్రతి సంవత్సరం ప్రధానంగా తోతాపురికి గిట్టుబాటు ధర విషయంలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది సీజన్ మొదట్లో టన్ను రూ. 25 వేలు ఉన్నా క్రమంగా సీజన్ ముగిసే సమయానికి రూ. 15వేలు అమ్ముకోవాల్సి వచ్చింది. దిగుబడి అంతంతమాత్రం ఉన్న పెరిగిన తోతాపూరి రకం మామిడి ధరల విషయంలో తేడా కనిపించకపోవడంతో మామిడి రైతులు గిట్టుబాటు ధర అందక అల్లాడిపోతున్నారు. ఫలితంగా ఏటా నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి మామిడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎంతో కాలంలో ఆచరణకు నోచుకోని మామిడి బోర్డును సత్వరమే ఏర్పాటు చేసి, ప్రస్తుత పంటపెట్టుబడులకు అనుగుణంగా కొత్త జీవోను ప్రవేశపెట్టాలి, తోతాపురికి కిలో రూ. 40ల ధరను నిర్ణయించాలి. రూ. 30లు గుజ్జు యజమానులు, రూ. 10 ప్రభుత్వ సబ్సిడీ అందజేయాలి, టేబుల్ వెరైటిలను విదేశాలకు ఎగుమతులను ప్రోత్సహించి సిండికేట్ లేకుండా గిట్టుబాటు ధరలు కల్పించి మామిడి రైతులను సత్వరమే ఆదుకోవాలి. ఎరువులు, మందులు అతి తక్కువ ధరలకు అందించి నకిలీ మందులను అరికట్టాలి. అడవి సమీపంలోని రైతులకు ఏనుగులతో పాటు అడవి జంతువుల వలన పంట, ప్రాణ రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు కొరకు అటవీశాఖ అధికారుల ఆమోద మేరకు వంద శాతం పూర్తి సబ్సిడీలతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రాదాన్యత ఇవ్వాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి రైతులకు ఎకరాకు రూ. 50వేలు నష్ట పరిహారం చెల్లించి బీమా ప్రీమియం చేసిన రైతులతోపాటు నష్టమైన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి.

మామిడి కాయలు నాణ్యత పెంచేందుకు అనువుగా కవర్లను 75 శాతం సబ్సిడీపై నాణ్యమైన కవర్లను అందజేయాలి. మామిడి సాగును ఉపాధి హామీతో పూర్తి స్థాయిలో అనుసంధానం చేపట్టి మామిడి రైతులకు ప్రాధాన్యత కల్పించాలి. మామిడి పల్ప్ గుజ్జు యజమానుల నుండి టిటిడి వారికి, ప్రభుత్వం కొనుగోలు చేసి, దేవాలయాలకు వచ్చే భక్తులకు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన విధ్యార్థులకు పానియాలు, మామిడి తాండ్రలను అందజేయాలి. మామిడి పరిశోధనా కేంద్రం జిల్లాలో ఏర్పాటు చేసి నూతన వంగడాలను అభివృద్ధి పరిచెందుకు ప్రాధాన్యత కల్పించి పండ్లతోటలను అబివృద్ధి పరచాలి. మామిడి తోటల కొమ్మల కత్తిరింపులు, ఇతర మైంటైన్స్ కొరకు ఇస్తున్న డబ్బులను రెండు రెట్లు పెంచి 6 సంవత్సరాల తోటల నుండి అందరికి వర్తింప చేయాలని జిల్లాలోని మామిడి రైతులు కోరుతున్నారు.

**మామిడి రైతులను ఆదుకోవాలి**

**- శంకర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు**

అకాల వర్షాల కారణంగా జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది 50శాతం మామిడి దిగుబడి వచ్చే అవకాశం ఉందని భావించినప్పటికీ అకాల వర్షాలతో మామిడి నేలరాలింది. ఇలా నేలరాలిన మామిడి టన్ను రూ. 2,3 వేలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలా నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. తోతాపురి గిట్టుబాటు విషయంలో ప్రభుత్వం ధర నిర్ణయించాలి.

## ప్రతిభకు గుర్తింపు

బహుమతి అందుకుంటున్న కె మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** ప్రజాశక్తిలో ఉత్తమ కథనాలు రాసినందుకు వెదురుకుప్పం విలేకరి కె మోహన్ రెడ్డి బహుమతి అందుకున్నారు. తిరుపతి యశోద నగర్‌లోని సిపిఎం కార్యాలయంలో రాయలసీమ రీజియన్ విలేకరుల ప్రాంతీయ శిక్షణా తరగతులు బుధ, గురువారం నిర్వహించారు. ప్రజాశక్తిలో ఉత్తమ కథనాలు రాసినందుకు ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల పరిధిలో వెదురుకుప్పం విలేకరి, జిడి నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె మోహన్‌రెడ్డి ప్రజాశక్తి జనరల్ మేనేజర్ హరికిషోర్, మేనేజర్ ప్రసాద్, డెస్క్ ఇన్‌ఛార్జి వనజ చేతుల మీదుగా ఉత్తమ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డిని సహచర పాత్రికేయులు అభినందించారు.

## మదనపల్లి జిల్లా కోసం నిరాహార దీక్ష

- జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా

**ప్రజాశక్తి -పుంగనూరు:** మదనపల్లి జిల్లా సాధన కోసం త్వరలో నిరాహార దీక్ష చేస్తానని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను చేపట్టబోయే దీక్షకు ప్రజా సంఘాలు, ఇతర రాజకీయ పార్టీల మద్దతు ఇవ్వాలని కోరారు. పుంగనూరు నియోజకవర్గాన్ని పులిచెర్ల తప్ప మిగిలిన మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపడం సంతోషించదగ్గ విషయం అన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు మదనపల్లి జిల్లాగా చేస్తానని హామీ ఇచ్చారని ఆ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరాహారదీక్ష చేపడుతామని హెచ్చరించారు.

తిరంగా యాత్రలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

## ఘనంగా తిరంగా ర్యాలీ

**ప్రజాశక్తి-పలమనేరు:** ఆపరేషన్ సింధూర్ విజయాన్ని కీర్తిస్తూ పలమనేరు పట్టణంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య అన్నారు. సైనికుల పోరాటానికి తమ మద్దతు వుంటుందన్నారు. ఈ ర్యాలీ కులమతాల ఐక్యతను చాటేలా సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దృశ్యం

## ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చారని జెడ్డి సినీ హీరో కృష్ణ మానినేని మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని బొమ్మయ్యపల్లిలో శ్రీ గౌర దేవి ఆలయం ముఖద్వారం పనుల కోసం గ్రామస్తులు విన్నవించగా స్పందించిన 100 డ్రీమ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జెడ్డి సినిమా హీరో మురళీకృష్ణ లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మాజీ సర్పంచ్ నిరాజ్జులుగౌడ్, లేపాకుల మురళి రాము, పలువురు పాల్గొన్నారు.

క్వారీని తనిఖీ చేస్తున్న తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్

## అక్రమ క్వారీ నిర్వహిస్తే చర్యలు: తహశీల్దారు

**ప్రజాశక్తి-బంగారుపాలెం:** అక్రమ క్వారీ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని పాలేరు వెదెన్ను కొత్తపల్లి సమీపంలోని క్వారీని గురువారం పరిశీలించారు. జంబువారిపల్లి లోని క్వారీని పలమనేర్ మైనింగ్ అధికారులు అసిస్టెంట్ జియాలజిస్ట్ కుమారస్వామి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, సర్వేయర్ అజితాబాయి పరిశీలించి వాహనాలను లోనికి అనుమతించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ క్వారీలు ఇసుక తవ్వకాలు చేపడితే కంటిన్యూ చర్యలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో రామకృష్ణ గోవిందరాయలు ఉన్నారు.

# సమస్యల తిష్ట!

• దారి సౌకర్యం కరువు • పట్టించుకోని ప్రభుత్వాలు • జగనన్న కాలనీలలో ఇక్కట్లు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని జగనన్న కాలనీలలో సమస్యలు తిష్ట వేశాయి. కనీసం దారి సౌకర్యం కరువైంది. కనీసం డ్రైనేజీలు లేవు. విద్యుత్ సౌకర్యం లేదు. ఫలితంగా జగనన్న కాలనీల ప్రజలు సమస్య సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. స్పందించాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కాలనీల వాసులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

**దారి సౌకర్యం కరువు**

మండలంలో రెండు చోట్ల జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో సరైన దారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంబడిగుట్ట, సర్కారు తోపు వద్ద గత వైసిపి ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 400 మందికి గత ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టాలు అందించారు. వారిలో 250 మందికి మాత్రం పక్కా గృహాలు మంజూరు అయ్యాయి. మండల కేంద్రం బైరెడ్డిపల్లి నుండి కంబడిగుట్ట జగనన్న కాలనీకి వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేదు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కారణంగా దారి సమస్య తలెత్తింది. దారి సమస్య పరిష్కారానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. ఈ కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాల్సి వుంది. ఆంజనేయ స్వామి కాలని పక్క వున్న జగనన్న కాలనీలలో కనీస మౌలిక సౌకర్యాలు ఏమీ లేదు. సిమెంటు రోడ్లు, విద్యుత్ సదుపాయం, తాగునీరు, సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులు రాత్రి వేళల్లో విష సర్పాలు, పురుగుల భయంతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. సర్కారు తోపు వద్ద వున్న జగనన్న కాలనీలోనూ సరైన రోడ్లు లేవు. వర్షాకాలంలో వర్షపు నీరు పడితే కాలనీ పరిసరాలు బురదమయమై ఇళ్లలోకి వెళ్లలేని భయాందోళనకు గురి కావాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.



దారి సౌకర్యం లేని జగనన్న కాలనీ

**పట్టించుకోని ప్రభుత్వాలు**

జగనన్న కాలనీలు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్నా ఈ కాలనీలపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. వెంటనే పాలకులు జగనన్న కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సి వుంది.

**అధికారులు స్పందించాలి**

ఇకనైనా మండల అధికారులు స్పందించి జగనన్న కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించిన జీవన గీత

## కుస్తీ పోటీల్లో జీవన గీతకు బంగారు పతకం

జాతీయ పోటీలకు ఎంపిక



**ప్రజాశక్తి - యాదమరి:** జాతీయ స్థాయిలో నిర్వహించే అండర్ 17 బాల బాలికల కుస్తీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున చిత్తూరు జిల్లా యాదమరి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారిణి ఇ జీవన గీత పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యులు గిరి రాజారావు తెలిపారు. చిత్తూరు మెసానికల్ మైదానంలో ఈనెల 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యాదమరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఈ జీవన గీత బంగారు పతకం సాధించింది. ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు జాతీయ స్థాయిలో నిర్వహించే కుస్తీ పోటీలలో జీవన గీత పాల్గొంటారు. క్రీడాకారిణిని పాఠశాల పీఈటీలు రవి, హరికృష్ణ, దాము, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి

## సైనిక్ ఫలితాలలో కృష్ణారెడ్డి శ్రీ చైతన్య ప్రభంజనం

**ప్రజాశక్తి -పుంగనూరు:** పట్టణంలోని కృష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల విద్యార్థులు సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సైనిక్ స్కూల్ పరీక్ష ఫలితాలు విడుదల కావడంతో ఈ విషయం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలకు చెందిన అనుదీప్ సాయి 262 మార్కులు సాధించి పట్టణంలోని మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జాగృతి 258, మునీశ్వర్ 258,పూర్ణచంద్ర 246 మార్కులు సాధించారని చెప్పారు. మరో 16మంది విద్యార్థులు 200 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ బృందాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న జిల్లా టిబి నియంత్రణ అధికారి

## పిహెచ్‌సి తనిఖీ

**ప్రజాశక్తి - యాదమరి:** మాదిరెడ్డిపల్లి పిహెచ్‌సిని జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం యాదమరి మండలం మాదిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంతమంది ఓపి పేషెంట్లు ఆస్పత్రికి వస్తున్నారు? వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్సి పరిధిలో టీబీ వ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉన్నారు? వారిని గుర్తించారా.. అలాంటి వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డిపల్లి పిఎసి డాక్టర్ శివకుమార్ రెడ్డి, డాక్టర్ వరప్రసాద్, సూపరువైజర్, వర్కర్స్ పాల్గొన్నారు.

## గంగమ్మ హుండీ ఆదాయం రూ.21,788

**ప్రజాశక్తి -సోమల:** మండల కేంద్రమైన సోమల పంచాయతీ పరిధిలో మంగళ, బుధ వారాలలో నిర్వహించిన నడివీధి గంగమ్మ జాతరలో భక్తుల నుండి 21,788 రూపాయలు హుండీ ద్వారా ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం చావడి లో భక్తులు కానుకలుగా వేసిన హుండీని లెక్కించగా ఈ ఆదాయం లభించిందని వరదం వెంకటరమణ, బీవీ సోమశేఖర్, ఐలా సురేంద్ర, చెన్న రాయప్ప, శంకర సుధాకర్, లింగన్న తెలిపారు. గంగ జాతర భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు



గంగమ్మ గుడి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

**ప్రజాశక్తి- పూతలపట్టు:** ప్రకృతి వ్యవసాయంతో ప్రజలు ఆరోగ్యం వంతులుగా ఉంటారని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు మాగంటి గోపాల్ రెడ్డి అన్నారు. పూతలపట్టు మండలం పి కొత్తకోట శ్రీనివాస కళ్యాణం మండపంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో రసాయనక ఎరువులతో పండించే పదార్థాలు తినడం వల్ల చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు అనేక జబ్బులతో బాధపడుతున్నారని. దీన్ని నివారించాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పంటలు పండించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేకనిధులు అందించనున్నారని రాబోయే తరం బాగుండాలంటే నేటి తరంలో ఉన్న మనం ప్రకృతి వ్యవసాయంతో రాబోయే తరం వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే కూరగాయలు వరి వీటన్నిటిని మనం తింటే క్యాన్సర్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వ్యాధులు, గుండె జబ్బులు. షుగర్ వ్యాధులు రావన్నారు. కార్యక్రమంలో రైతు నాయకుడు చంగల్రాయిరెడ్డి. రైతులు రాజారత్నం రెడ్డి. ప్రభాకర్ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, బాబు కిరణ్, వారి వెంటనే వెంకట నరసింహులు. జగన్నాథరెడ్డి. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

మినీ మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

**ప్రజాశక్తి -సోమల:** మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ టిడిపి నాయకులు మినీ మహానాడులో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈనెలలో కడపలో నిర్వహించనున్న మహానాడు విజయవంతం చేసేందుకు మండల కేంద్రమైన సోమల మార్కెట్ యార్డులో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబుల మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం ఆరు ముఖ్యమైన తీర్మానాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. వీటిలో ముఖ్యంగా పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో రాయచోటి డివిజన్లో విలీనం చేయడాన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో భాగమైన పులిచెర్ల మండలాన్ని చిత్తూరు జిల్లా నుండి అన్నమయ్య జిల్లాలోకి కలపాలని తీర్మానం చేశారు. ముఖ్యంగా మదనపల్లి ను జిల్లా కేంద్రంగా చేసి ఆ తరువాత పుంగనూరును మదనపల్లి జిల్లాలో విలీనం చేయాలని ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రజల అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా మామిడి రైతులు ధరలు లేక గిట్టుబాటు కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మామిడి రైతులకు గిట్టుబాటు ధర

మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి

కల్పించి ఆదుకోవాలని తీర్మానం చేశారు. నియోజకవర్గంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని ఆ రైతులకు పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడుతామని తీర్మానం చేశారు. కడపలో నిర్వహించే మహానాడు ను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మినీ మహానాడులో తీర్మానించిన ప్రతి ఒక్క తీర్మానాన్ని ఆమోదయోగ్యం చేయడానికి తన వంతు కృషి చేస్తానని చల్లాబాబు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## కల్పవృక్ష వాహనంపై వేణుగోపాలుడు

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన గురువారం ఉదయం శ్రీవేణుగోపాలుడు కల్పవృక్షవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాల, పంచాంగశ్రవణం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం కల్పవృక్షవాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం. నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ధూప, దీప, నైవేద్యాలతో రెండవ గంట నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

**కల్యాణోత్సవం**

గురువారం సాయంత్రం వేణుగోపాలస్వామి

ఆలయంలో ఉభయ నాంచారుల సమేత శ్రీవేణుగో పాలునికి కళ్యాణోత్సవం కను విందుగా నిర్వహిం చారు. అధిక సంఖ్యలో దంప తులు పాల్గొని తీర్థ ప్రసాదలతో పాటు వస్త్ర బహుమానం అందుకున్నారు. హాజరైన వారికి టిటిడి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఈవొ నాగరత్న, ఏఈవో రవి. సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయాధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టర్ తరుణ్ కుమార్, వేదపండితులు నారాయణదాశరథి. రమేష్ శభరీష్, గోపాలస్వామి, ధన్వంతరి, ప్రశాంత్, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## ధరలు పతనం

పంట కోయకుండా చేలల్లోనే వదిలేస్తున్న టమాటా రైతన్నలు

**ప్రజాశక్తి -సోమల:** మండలంలో రైతులు వేల ఎకరాలలో టమాటా పంటను సాగు చేశారు. కొందరు సొంత భూముల్లో సొంతంగా కష్టపడి పంట పండిస్తుండగా మరికొందరు భూములు లీజుకు తీసుకొని లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి టమాటా పంటను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో టమోటాకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు పంట కోసిన కూలీలకు రవాణాకు కూడా డబ్బులు రావడం లేదని కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు టమాటా పంటను కోసి పుంగనూరు కలికిరి పలమనేరు తదితర ప్రాంతాలలోని మార్కెట్లలో విక్రయిస్తూ ఉంటారు. 15 కేజీల బాక్స్ 50 రూపాయల ధర కూడా లేక పోవడంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టా డుతున్నారు. ఒక్కో ఎకరాకు దున్నకం, ఎరువులు, టమోటా నారు రసాయనిక మందులు కట్టెలు కూలీలు అన్ని కలిపి దాదాపు మూడు లక్షల పైగా ఖర్చు వస్తుందని చివరికి పంట బాగా వచ్చి కోత కోసే సమయానికి ధర లేక నష్టాలు సరిచూడాల్సి వస్తోందని అంటున్నారు. టమోటా రైతుకు తాను పండించిన పంటకు మంచి ధర పలికి లాభాల బాట పట్టాలని కోరుకుందాం.

గిట్టుబాటు ధరలేక పొలాల్లోనే వదిలేసిన టమాటా పంట

# భక్తులకు అన్నదానం

**ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి :** బైరెడ్డిపల్లి బైరెడ్డి పల్లి సమీపంలోని పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలో రామాంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భోజన సౌకర్యం కల్పించారు. గుడి ధర్మకర్తలు బైరెడ్డిపల్లి, చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**గంగాధర నెల్లూరు:** మండలంలోని గోవిందరెడ్డి పల్లి మిట్టూరు గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసుదేవ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైసిపి మాజీ మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మాజీ రాష్ట్ర గ్రీన్ ఇన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు మునిరాజు రెడ్డి, చిన్నమ్మ రెడ్డి, బాబు రెడ్డి, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.
హుండీ ద్వారా వచ్చిన డబ్బును లెక్కిస్తున్న దృశ్యం.

**ఎస్‌ఆర్ పురం :** ఎస్‌ఆర్ పురం మండలంలోని సింధూ రాజపురం గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయఛైర్మన్ బాలాజీ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు సుందరకాండ పారాయణం, కోలాటం భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయుడు కేశవ నాయుడు భాస్కర్ నాయుడు మాధవ నాయుడు హేమాద్రి యాదవ్ బుల్లెట్ బాబు నాయుడు మోహన్ నాయుడు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

**సోమల:** సోమల సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుంతల్లో వరి నాట్లు నాటి నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

## రహదారులు బురద మయం

- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు
- గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** రోడ్లు బురదమయం అయ్యి ప్రజలకు నానా ఇక్కట్లు కలిగిస్తున్నాయి. అధికారులు స్పందన లేక ప్రజల ప్రతిరోజూ కష్టాల్లో ప్రయాణం చేస్తున్నారని స్పందించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో రహదారులు గుంతలమయమై ప్రయాణికులకు ఇక్కట్లు కలిగిస్తున్నాయి. మండలంలోని బంగారుపాలెం నుండి రాగి మాను పెంటకు వెళ్లే రహదారిలో వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండడంతో గురువారం వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాగి మాను పెంట గ్రామస్తులు బాలకృష్ణ నాయుడు, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎక్లాంప్సియాపై అవగాహన కల్పించాలి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ప్రపంచ ప్రీ ఎక్లాంప్సియా డే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలుపుతూ తల్లులకు అందరికి కాన్పు సమయంలో వచ్చే ఎక్లాంప్సియాపై అవగాహన కల్పించాలని డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి ఆదేశించారు. ఈ సందర్భంగా డిఎం అండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రపంచ ప్రీ ఎక్లాంప్సియా ఉన్న గర్భిణీలలో హై బీపీతో ఉండి లివర్, కిడ్నీలపై చెడు ప్రభావం చూపిస్తాయని, తద్వారా ఎర్ర రక్తకణాల క్షీణతతో లివర్స్‌పై చెడు ప్రభావం, యూరిన్‌లో ప్రోటీన్స్ ఉండటం వల్ల లెగ్స్‌లో నీరు చేరటం కనిపిస్తాయని అన్నారు. ఎక్లాంప్సియా సంభవించే మూర్ఛలు, వీటి లక్షణాలు సాధారణంగా అధిక రక్తపోటు, తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, మూర్ఛలు, పై కడుపునొప్పి, ముక్కు కారటం, తక్కువ యూరిన్ రావడం, వాంతులు రావడం, గాలి పీల్చుకోలేకపోవడం వంటి జరుగుతాయన్నారు. ఎక్లాంప్సియాగర్భధారణ రెండవ భాగంలో సంభవించే అరుదైన తీవ్ర పరిస్థితి అని, వీటిని ఎలా నివారించాలో డాక్టర్లు తప్పనిసరిగా తెలుసుకోవాలని అప్పుడే మాతృమరణాలు జరగకుండా నివారించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రవీణ,ప్రోగ్రాం అధికారులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రీ హెల్త్ క్యాంప్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ప్రశాంత్ నగర్ కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఫ్రీ హెల్త్ క్యాంపును గురువాం నిర్వహించారు. ఇందులో వివిధ రకాల రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేశారు. అందరికీ ఐడి క్రియేషన్, ఈహెచ్‌ఆర్ రికార్డ్ చేశారు. ఈ ఎంప్లాయిస్ హెల్త్ రికార్డ్స్‌తో వెనుక ఏదైనా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే ట్రీట్మెంట్ ఇవ్వడానికి దోహద పడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుధారాణి తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగస్తులందరూ వినియోగించుకోవాలన్నారు. వివిధ పిహెచ్‌సిలోనూ ఇలాంటి క్యాంప్స్ ఉద్యోగస్తులకు పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అనూష, డాక్టర్ గిరి, ఏవో పద్మజ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

27 ప్రతిపాదనలకు ఆమోదం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్‌రాజన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ఏపీ గ్రీన్ ఎనర్జిటిక్‌గా రూపాంతరం చెందుతుందన్నారు. ఈనెల 27, 28, 29 తేదీలలో కడప వేదికగా జరుగనున్న మహానాడు మహాసభల నేపథ్యంలో గురువారం చిత్తూరు టిడిపి కార్యాలయంలో టిడిపి పార్లమెంటు స్థాయి మినీ మహానాడు ను విజయవంతంగా నిర్వహించారు. ముందు పార్టీ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహానికి ఎంపి, ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, చూడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన మహానాడులో 27 ప్రతిపాదనలను తీర్మానించి, ఆమోదం తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేని వైసిపి, పనిచేసే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని, వైసిపి నాయకులు చేస్తున్న నిరాధారణ ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్‌మనోహర్, గాంధీ, మేయర్ కుమారి అముద, కోదండ యాదవ్, చంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.